ప్రజాశక్తి

శనివారం 3 జనవరి 2026 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







స్టాల్స్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.నరసింహ



పుస్తక ప్రియులతో రద్దీగా ఉన్న స్టాల్

పుస్తక ప్రియుల పండుగ ప్రారంభం

పుస్తక ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 36వ విజయవాడ పుస్తక మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.నరసింహా జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. పుస్తక ప్రదర్శన తొలి రోజు సాయంత్రం 4 గంటల నుండే సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

(పూర్తి వివరాలు మెయిన్, టాబ్లాయిడ్ 8వ పేజీలో)



సమీక్షా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపిలు బాలశౌరి, కేశినేని, ఎంఎల్‌ఎలు, అధికారులు

జాతీయ రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు

- రూ. 1900 కోట్లతో మచిలీపట్నం- విజయవాడ రోడ్డు విస్తరణ
- రూ.400 కోట్లతో పోర్టు కనెక్టవిటీ రోడ్డు
- తీరం వెంబడి లోసరి - ఉల్లిపాలెం బ్రిడ్జి వరకు 216 డైవర్షన్
- పిఎం గతిశక్తిలో పామర్రు - చల్లపల్లి రోడ్డు అభివృద్ధి
- త్వరలో బందరు - రేపల్లె రైల్వేలైన్ రెండో దశ సర్వే
- వెల్లడించిన మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణాజిల్లాలోని జాతీయ రహదారుల విస్తరణ, అనుసంధాన రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, పోర్టు కనెక్టివిటీ రోడ్లు, అమరావతి రింగ్ రోడ్డు అభివద్ధి, భూ సేకరణ అంశాలపై ఎన్‌హెచ్‌ఎఐ పీడీలు, మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు హైవేస్ (మోర్తు), రెవెన్యూ అధికారులతో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల ఎంపిలు, ఎమ్మెల్యేలు మచిలీపట్నంలోని ఎంపి బాలశౌరి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. అనంతరం మంత్రి కొల్లు, ఎంపి బాలశౌరి మీడియాతో మాట్లాడుతూ మచిలీపట్నం పోర్టు ఆపరేషన్స్ ఈ ఏడాది మొదలవుతాయని చెప్పారు. దాదాపు రూ.450 కోట్ల వ్యయంతో పోర్టు అనుసంధాన రహదారులను అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. బందరుకోట, చిలకలపూడి, కరగ్రహారం, పోతేపల్లి ప్రాంతాల్లో నాలుగు ఆర్‌వోబిలకు ప్రతిపాదనలు పంపామన్నారు. దాదాపు రూ.1900 కోట్ల వ్యయంతో మచిలీపట్నం – విజయవాడ 65 జాతీయ రహదారిని ఆరు వరుసలు విస్తరిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగానే బెంజిసర్కిల్ నుంచి గోశాల వరకు ఎలివేటెడ్ కారిడార్ విస్తరణపై ప్రత్యేకంగా చర్చించామన్నారు. రూ.38 వేల కోట్ల వ్యయంతో 189.930 కిలో (మిగతా 2లో)

వంశీని అరెస్టు చేయొద్దు

హైకోర్టు ఉత్తర్వులు



ప్రజాశక్తి - గన్నవరం (ఉంగుటూరు) : విజయవాడ మాచవరం పోలీస్‌స్టేషన్లో నమోదైన హత్యాయత్నం కేసులో గన్నవరం మాజీ ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీకి హైకోర్టులో ఊరట లభించింది. వంశీని తొందరపడి అరెస్టు చేయొద్దని హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ కోసం వంశీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు విచారణ పూర్తయ్యే వరకు వంశీని అరెస్టు చేయరాదని పోలీసులను ఆదేశించింది. కేసు తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈసమయంలో పోలీసులు వంశీకి నోటీసులు జారీ చేసి అవసరమైతే విచారించవచ్చని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులతో వంశీకి తాత్కాలికంగా ఉపశమనం లభించింది.

జాస్తి బసవరావు స్ఫూర్తితో

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు



సభలో మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి - గన్నవరం (ఉంగుటూరు) : జాస్తి బసవరావు స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పిలుపునిచ్చారు. ఆ విధానాలను ఎదుర్కోవడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళులర్పించిన వారమవుతామన్నారు. గన్నవరం మండలం కేసరపల్లిలో అమరవీరుడు జాస్తి బసవరావు 76వ వర్ధంతి నిర్వహించారు. బసవరావు స్థూపం వద్ద నరసింహారావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో నరసింహారావు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద వర్గాల విముక్తి కోసం సాగిన పోరాటంలో 21 ఏళ్ల వయస్సులోనే జాస్తి బసవరావు ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. వందేళ్లకుపైగా బ్రిటిష్ వారి పాలనలో దేశం మగ్గిపోయిందన్నారు. దాని విముక్తి కోసం, దేశ స్వాతంత్య్రం కోసం సుభాస్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి వారు ప్రాణాలర్పించారని చెప్పారు. స్వాతంత్య్ర ఉద్యమాల స్ఫూర్తితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జమీందారులు, జాగీరుదారుల అరాచకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు అండగా నిలిచిన నేతలను అప్పటి కాంగ్రెస్ పాలకులు తుపాకులతో కాల్చి చంపారని వివరించారు. ఉద్యమాలను అణచివేసేందుకు జరిపిన పోలీసు కాల్పుల్లో జాస్తి బసవరావు మరణించారని చెప్పారు. ఈపోరాటంలో బసవరావుతోపాటు చింతపల్లి పాపారావు, కాట్రగడ్డ చిన్న వెంకటరాయుడు, పామర్తి సుబ్బారావు, ఇరుగు నోబెల్ లాంటి 34 మంది ప్రాణాలర్పించారని తెలిపారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పాలకులు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ప్రైవేటీకరణ విధానాలతో దేశ సంపదను వారికి దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలపై మాత్రం భారాలు వేస్తున్నారని చెప్పారు. వీటిని ప్రతిఘటించిన నేతలను, శ్రేణులను పాలకులు అరెస్టు చేసి పీడీ యాక్ట్ కింద కేసులు పెడుతున్నారని చెప్పారు. అప్పలరాజు అరెస్టే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. గంజాయి మాఫియాను అడ్డుకున్నందుకు నెల్లూరులో కళాకారుడు పెంచలయ్యను హత్య చేశారని చెప్పారు. ప్రజా ప్రతినిధులంటే ఎలా ఉండాలో గన్నవరం (మిగతా 2లో)

విద్యుత్ భారాలు, ట్రూ డౌన్‌పై

బహిరంగ చర్చకు సిద్ధం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు
- స్మార్ట్ మీటర్లు, భారాలపై పోరాటం కొనసాగిస్తాం



మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, చిత్రంలో దోనేపూడి కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : విద్యుత్ భారాలపై, ట్రూ డౌన్ మోసంపై సిపిఎం బహిరంగ చర్చకు సిద్ధమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు అన్నారు. విద్యుత్ మంత్రి చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నూతన సంవత్సరం లోనూ పోరాడతామన్నారు. విజయవాడలోని శ్రీశ్రీ (మిగతా 2లో)

మితిమీరిన వేగం

- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న భారీ వాహనాలు



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలో టిప్పర్ల వేగంతో జనాలు బేంబేలేత్తుతున్నారు. బూడిద, కంకర, పెద్ద పెద్ద బండ రాళ్ళను రవాణా చేస్తున్న భారీ టిప్పర్లు వేగానికి అడ్డు అదుపు లేకుండా పోయింది. మితిమీరిన వేగంతో, టిప్పర్ లారీల ఓవర్ లోడ్లతో అతివేగంగా రవాణా చేస్తున్నారు. దొనబండ, ఇబ్రహీంపట్నం కొండపల్లి నుంచి కషర్లలో తయారయ్యే కంకర లోడ్ లతో, వాహనానికి అనుమతి ఇచ్చిన బాడీ కంటే మూడు నాలుగు అడుగుల ఎత్తు కంకర వేసుకుని జాతీయ రహదారిపై అతివేగంగా వెళుతున్నారు. నియంత్రణ లేని వేగంతో వెళుతున్న వాహనాలు జాతీయ రహదారిపై హఠాత్తుగా బ్రేకులు వేసినప్పుడల్లా రోడ్ల నిండా కంకర పడవేసుకుంటూ వెళ్తున్నాయి. రోడ్లపై చిందరవందరగా పడిన చిప్స్, కంకర వలన ద్విచక్ర వాహనదారుల ప్రాణాలు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, అదనపు లోడ్‌తో మితిమీరిన వేగంతో భారీ వాహనాలు రూల్స్ బ్రేక్ చేసి వారి ఇష్టానుసారం వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న చర్యలు శూన్యం అని, స్థానికులు ఆవేదన చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదాలకు కారణమవుతున్న భారీ వాహన దారుల పై, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



బెంజ్ సర్కిల్‌లో అరాచకం సృష్టించినా పట్టని పోలీసులు : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా లేక అసాంఘిక శక్తులకు బెజవాడ రోడ్లను రాసిచ్చేశారా అని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంకా గోవిందరాజులు ప్రశ్నించారు. జనవరి 1న తెల్లవారుజామున బెంజ్‌సర్కిల్ సాక్షిగా జెండాల ముసుగులో జరిగిన వేడుకలు చూసి నగరం నివ్వెరపోతోందని ఆయన మండిపడ్డారు. కొందరు నడిరోడ్డుపై చొక్కాలు విప్పి, జెండాలు ఊపుతూ, బాంబులు పేలుస్తూ వీరంగం సృష్టిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నూతన సంవత్సర వేడుకల వేళ ఆంక్షల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన పోలీసులు... బాంబుల మోతతో కొందరు యువకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. పోలీసులు బీభత్సం సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

జాతీయ రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

మీటర్ల అమరావతి రింగ్ రోడ్డు అభివద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రూ.25 కోట్ల వ్యయంతో గుడివాడ పట్టణంలో జాతీయ రహదారుల అభివద్ధికి చర్యలు చేపట్టామన్నారు. 350 కిలోమీటర్ల కత్తిపూడి-ఒంగోలు 216 జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. లోసరి బ్రిడ్జి నుంచి తాళ్లపాలెం, గిలకలదిండి, ఉల్లిపాలెం, వాడపాలెం, కోడూరు మీదుగా తీరం వెంబడి ఉల్లిపాలెం బ్రిడ్జి వరకు 75 కిలోమీటర్ల తీర ప్రాంతంలో డైవర్షన్ రోడ్డు అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి, సముద్ర తీర ప్రాంతానికి రక్షణ కవచంగానూ ఈ రహదారి ఉపయోగపడుతుందన్నారు. మచిలీపట్నంలో పోర్టు కనెక్టివిటీ రోడ్డుకు నెలాఖరులోగా రూ.400 కోట్లు మంజూరవుతాయని తెలిపారు. పీఎం గతిశక్తి పథకం ద్వారా పామర్రు, చల్లపల్లి ప్రాంతాలను జాతీయ రహదారులతో అనుసంధానానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా పామర్రు - చల్లపల్లి రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని తెలిపారు. కంకిపాడు నుండి గుడివాడ వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారి ప్రతిపాదించామని, దీనిని రింగ్ రోడ్డుతో అనుసంధానానికి సూచించామని చెప్పారు. దీనికి సమాంతరంగా మచిలీపట్నం, పామర్రు, గుడివాడ అనుసంధాన రోడ్ల ఏర్పాటుపై పలు సూచనలు వచ్చాయన్నారు. గుడివాడ పట్టణంలోని ప్రధాన రహదారిని రూ.25 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధికి సాస్కి నిధుల్లో భాగంగా జిల్లాకు రూ.100 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు.

బందరు- రేపల్లె రైల్వేలైన్‌కు రెండో దశ సర్వే

బందరు - రేపల్లె రైల్వేలైన్ మొదటి దశ సర్వే పనులు పూర్తయ్యాయని, రెండో దశ సర్వే త్వరలోనే ప్రారంభమవుతుందని మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఈలైను ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను సంబంధిత కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. రైల్వేలైన్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారని వివరించారు.

కృష్ణలంకలో ప్రమాదాలపై చర్యలు : ఎంపి కేశినేని

తొలుత సమీక్షా సమావేశంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ లక్షకు పైగా జనాభా ఉన్న కష్ణలంక ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున తగిన విధంగా మార్పులు చేయాలని సూచించారు. పెనమలూరు నుండి బెంజ్‌సర్కిల్ మీదగా కొత్త బస్‌స్టేషన్ వరకు ఫ్లైఓవర్‌కు ప్రతిపాదించారు. 16, 65 జాతీయ రహదారులను అనుసంధానించాలన్నారు. పెనమలూరు, పెడన, గుడివాడ, విజయవాడ తూర్పు, పామర్రు ఎమ్మెల్యేలు, అవనిగడ్డ బోడే ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము, గద్దె రామమోహనరావు, వర్ల కుమార్ రాజా, మండలి బుద్ధప్రసాద్, మార్క్‌ఫెడ్ చైర్మన్ బండి రామకృష్ణ, జాతీయ రహదారుల ఆర్ఓ ఆర్‌కె.సింగ్, పీడీ విద్యాసాగర్, రాష్ట్ర రహదారుల ఆర్ఓ హరికృష్ణ, పీడీ సాయి శ్రీనివాస్, అమరావతి రింగ్ రోడ్ పీడీ పార్వతీశం, ఆర్ అండ్‌బి ఎస్ఇ శంకర్ రెడ్డి, ఈఈ శ్రీనివాస్, డిఆర్ఓ కె చంద్రశేఖరరావు, బందరు, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

నుండి మూడు సార్లు గెలిచిన పుచ్చలపల్లి సుందరయ్యతోపాటు గన్నవరం ప్రాంతానికి మానికొండ సూర్యావతి, డాక్టర్ సి.ఎల్ రాయుడు, అట్లూరి శ్రీమన్నారాయణ వంటివారు ఆదర్శంగా నిలిచి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. దీనికి భిన్నంగా నేటి పాలకులు రాజకీయాన్ని వ్యాపారమయం చేశారని, దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలపై సిపిఎం చేస్తున్న పోరాటాలకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఏరియా కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి మాట్లాడుతూ పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మూల్పూరి బాలకృష్ణారావు, సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, సూదాబత్తుల బుజ్జి, సూదాబత్తుల కమల, బి.మరియదాసు, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం

భవన్లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 2019-24 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌పై అదనంగా రూ.12,771 కోట్ల మేర ట్రూ అప్ ఛార్జీలను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంపిణీ సంస్థలు నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపాయన్నారు. దీనిలో రూ.8,274 కోట్లు (64శాతం) తప్పుడు లెక్కలని తేల్చి వాటిని విద్యుత్ నియంత్రణ మండలి తిరస్కరించిందని అన్నారు. రూ.4,497 కోట్లు మాత్రమే ట్రూ అప్ చార్జీలు వసూలు చేయాలని ఆదేశించిందన్నారు. అదనపు భారంపై సిపిఎం నియంత్రణ మండలిలో గళం విప్పిందని, అభ్యంతరాలు తెలిపి, నిరసన ఉద్యమం నిర్వహించి, ప్రభుత్వ బండారాన్ని బట్టబయలు చేసిందని అన్నారు. సిపిఎం, వివిధ సంఘాలు, నిపుణులు చేసిన పోరాట ఫలితంగా నియంత్రణ మండలి అదనపు భారాన్ని తిరస్కరించిందని చెప్పారు. కానీ గత 26 సంవత్సరాల్లో ఏనాడూలేని విధంగా కూటమి ప్రభుత్వం ట్రూ డౌన్ చేసిందని విద్యుత్ శాఖా మంత్రి ప్రకటించడం శోచనీయమన్నారు. నియంత్రణ మండలికే తప్పుడు లెక్కలు చూపి ప్రజలపై భారం మోపటానికి కుట్రపన్నిన కూటమి ప్రభుత్వం... ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలోని అవినీతి, అక్రమ ఒప్పందాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యుత్ విధానాలు, అవినీతి తప్పుడు ఒప్పందాల విషయంలో బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి దోషులుగానే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఆపాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగాఆరు పైసల నుండి 100 పైసలకు పెంచిన విద్యుత్ సుంకం అదనపు వసూళ్లను ఆపాలని, రూ.6 వేల కోట్లు తిరిగి వినియోగదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏనాడో వాడుకున్న కరెంటుకు మళ్ళీ మళ్ళీ అదనంగా వసూలు చేసే ట్రూ అప్ ఛార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.

భూ సర్వేకు సహకరించాలి : జెసి



ఉయ్యూరులో సర్వే పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి-ఉయ్యూరు : భూసర్వేలో యాజమాన్య హక్కులు నిర్ధారించడంలో వివాదాలకు తావులేకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. రెండోవిడత భూ సర్వేను శుక్రవా రం కాటూరు ప్రారంభించారు. మూడు సర్వే టీములు పనితీరును క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భూమి రికార్డులు, యాజమాన్య హక్కులు క్రమబద్ధీకరించేందుకు వివాదాలు నివారించేందుకు సర్వే చేస్తున్నామన్నారు. రైతుల సమక్షంలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తారని, సరిహద్దు వివాదాలు లేకుండా సర్వేలో తలెత్తే చిన్న చిన్న వివాదాలను తహసీల్దార్ గ్రామపెద్దల సమక్షంలో పరిష్కరిస్తారన్నారు. ప్రభుత్వ భూములు కలుపుకుని వ్యవసాయం చేస్తున్న రైతుల భూమిని విడగొట్టి హద్దులు నిర్ణయించి చూపుతామని తెలిపారు. వివాదాల పరిష్కారం కోసం గ్రామపెద్దలతో రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహిస్తారని, ఆ విధంగా పరిష్కారం కాకపోతే రైతులు కోర్టుకు వెళ్లవచ్చన్నారు. మండల తహసీల్దార్ సురేష్ కుమార్, సర్వేయర్ సురేశ్, ఆర్.ఐ యేతేంద్రియులు, రైతులు ఆళ్ల శ్రీకాంత్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ మండలంలో నాలుగవ విడతగా నిడుమోలు, కోసూరుల లోని పొలాలకు సంబంధించి రీసర్వేను శుక్రవారం నుంచి రెవెన్యూ, సర్వే సిబ్బంది ప్రారంభించారు. మండల తహసిల్దార్ కే మస్తాన్, మండల సర్వేయర్ ఏ కిషోర్ బాబు పర్యవేక్షణలో నిర్వహించే సర్వే కార్యక్రమం నిడుమోలులో వీఆర్వో ఏ రవి, సర్వేయర్లు తెల్లాకుల ప్రదీప్ (నిడుమోలు),మాగంటి ఆంజనేయులు (కూచిపూడి) ప్రారంభించారు .అలాగే కోసూరు గ్రామంలో నిర్వహించే సర్వే కార్యక్రమంలో వీఆర్వో ఎం నవీన్ రెడ్డి, సర్వేయర్లు ఇమ్రాన్ పఠాన్ ఖాన్ (కోసూరు), అబ్దుల్ అలీ (మొవ్వ-1), తాతా లలిత (మొవ్వ-2) చేపట్టారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ భూమి-మీ హక్కు నాలుగో విడత రీ -సర్వే విజయవంతం కావాలని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం తెలిపారు. శుక్రవారం అవనిగడ్డలోని తమ వ్యవసాయ భూమిలో రీ -సర్వే కార్యక్రమాన్ని వెంకట్రాం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తాసిల్దార్ అవనిగడ్డ శ్రీనివాసరావు, ఆర్ ఐ బచ్చు బాలాజీ, వీఆర్వోలు పెండ్యాల చంద్రమోహన్, కల్లేపల్లి వేణు, సిద్ధ బత్తిన నారాయణరావు, బచ్చు నాగ వాసంతి పాల్గొన్నారు.**ప్రజాశక్తి - గుడివాడ** : గుడివాడ మండలం సిద్ధాంతం గ్రామంలో రీ సర్వే గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి యాజమాన్యపు హక్కు, పట్టాదారు పాసుపుస్తకాలు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని చిన్ని, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, ఎంఆర్ఓ కిరణ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ కేలండర్లు, డైరీలు అందిస్తున్న దృశ్యం

యుటిఎఫ్ కేలండర్లు, డైరీలు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండల యుటిఎఫ్ యూనిట్ తరుపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ డైరీ, క్యాలెండరు, వాల్ పోస్టర్‌ను మండల అధికారులకు శుక్రవారం అందజేశారు. ఎంఈఓ 1జి. జగన్మోహన్రావు, జి.గోపాల రావుకు అలాగే ఎంపీడీవో ఇమ్రాన్, మండల తహసీల్దార్ బి లోకరాజుకు యుటిఎఫ్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్షులు డివిఎం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె వెంకటరావు, జిల్లా కార్యదర్శి ఎవి.వరలక్ష్మి, జి శ్రీనివాస్ రావు, కె రత్నం, యం ఆరోగ్యం, కేవిఎల్ శ్రీనాథ్, జి రాజేంద్ర ప్రసాద్, ఎంవి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరున్ని దర్శించుకున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-మోపిదేవి : నూతన సంవత్సరం సందర్భంగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరుని శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వాగతం పలికి ప్రసాదాలు అందించారు.

విద్యాసంస్థల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా

ప్రజాశక్తి-కంకిపాడు : విద్యాసంస్థల వద్ద విద్యార్థినిల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘాను పటిష్టం చేసింది. విద్యాసంస్థల వద్ద ఆకతాయిల వేధింపులుగాని, అనవసర గుంపులు కళాశాల చుట్టుపక్కల చేరకుండా చెక్ పెట్టే లక్ష్యంతో ఈ డ్రోన్ పర్యవేక్షణను అమలు చేస్తున్నారు. విద్యాసంస్థలు, కళాశాలలో తెరిచే సమయంలో మరియు సాయంత్రం ముగింపు సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆ చుట్టుపక్కల అనుమానాస్పదంగా ప్రవర్తించే వ్యక్తులను గుర్తించి వెంటనే



విద్యార్థినులతో మాట్లాడుతున్న పోలీసులు

వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, ధనేకులా ఇంజనీరింగ్ కళాశాల చుట్టుపక్కల ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో పెనమలూరు ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థినిలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

ఉద్యోగాల విషయంలో దళారుల మాటలు నమ్మొద్దు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. యుగంధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఖాళీలున్న పలు పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్లు జారీ చేసిన నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరికలు చేశారు. జిల్లాలో ల్యాబ్ టెక్నీషియన్లు, శానిటరీ అటెండర్ కం వాచ్‌మన్, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసినట్లు తెలిపారు. పోస్టులు పారదర్శకంగా పూర్తిగా రోస్టర్ పాయింట్లు, మెరిట్ ఆధారంగానే జరుగుతుందన్నారు. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలు, రోస్టర్ విధానాన్ని కచ్చితంగా పాటిస్తామని తెలిపారు. అభ్యర్థుల మెరిట్ లిస్టును ముందుగా ప్రదర్శించి, అనంతరం ఫైనల్ సెలక్షన్ లిస్టును కూడా అధికారికంగా డిస్ప్లే చేయడం జరుగుతుందని వివరించారు. కాబట్టి అధికారుల పేర్లు చెప్పి లేదా ప్రభుత్వంతో సంబంధం ఉందని చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడే వ్యక్తులను నమ్మి ఎవ్వరూ డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు.



ఎంపిని సన్మానించిన బండి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : నూతన సంవత్సరంలో మొదటిసారి శుక్రవారం ఎంపీ బాలసౌరిని డిసిసిఎం చైర్మన్ బండి రామకృష్ణ కలిసిన సందర్భంగా పూలమాలలతో సత్కరించి మిఠాయిలు అందజేశారు. అనంతరం ఎంపీ నేతృత్వంలో నిర్వహించిన జాతీయ రహదారుల అభివృద్ధి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. జనసేన మచిలీపట్నం టౌన్ అధ్యక్షులు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి : సిఐ

ప్రజాశక్తి-అవనిగడ్డ : వాహనచోదకులు రహదారి భద్రత నియమాలు కట్టుదిట్టంగా పాటిస్తూ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవనిగడ్డ సీఐ జి. యువకుమార్ సూచించారు. అవనిగడ్డ ఏపీఎస్ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ కే హనుమంతరావు అధ్యక్షతన శుక్రవారం జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ యువకుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు భద్రతకు ప్రాధాన్యతనిచ్చి వాహనాలు నడపాలని, అనవసర ఇబ్బందులకు అవకాశం లేకుండా ఆర్టీసీ నినాదమైన "సురక్షిత ప్రయాణం"ను ప్రయాణికులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కే. శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్. శ్రీలక్ష్మి, డిపో సూపర్వైజర్, వివిధ సంఘాల అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : గుడివాడ ఆర్‌టిసి డిపోలో ఈ ఏడాది ప్రమాదాల రేటు తక్కువగా ఉండడం డైవర్ల పనితీరుకు నిదర్శనమని 2టౌన్ సిఐ హనీష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి బస్సు డిపో గ్యారేజీలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను హనీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డిపో మేనేజర్ ఎస్.సునీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రైవర్‌లు మానసిక విశ్రాంతితో మంచి ఆరోగ్యపు అలవాట్లు అలవర్చుకొని దురలవాట్లకు దూరంగా ఉండి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) కేశవ్‌కుమార్, ట్రాఫిక్ ఇంచార్జి ఈశ్వరరావు, సూపర్వైజర్లు, అసోసియేషన్ల ప్రతినిధులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



గుడివాడలో మాట్లాడుతున్న సిఐ హనీష్

చెరువులో పసిపాప మృతదేహం

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ప్రజాశక్తి మోపిదేవి : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో రావి ప్రభుకుమార్‌కు చెందిన 45 రోజుల పసిపాప ఇంటి వెనుక ఉన్న చెరువులో శవమై తేలింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కె. ఈశ్వరరావు తెలిపారు. చెరువులో పసిపాప మృతిచెందినట్లు తమకు సమాచారం వచ్చిందని, నిజానిజాలు తెలసుకునేందుకు దర్యాప్తు చేస్తామన్నారు. కుటుంబ కలహాల లేదా మరేదైనా కోణం ఉందా అన్న విషయంపై దర్యాప్తు చేస్తామన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-గూడూరు : కోడిపందాలు,పేకాట శిబిరాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం గూడూరు మండలం సూరదాయిపేట గ్రామంలో కోత ముక్క పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి రూ. 8,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, రాయవరం గ్రామంలో కోత ముక్క పేకాట ఆడుచున్న పదకొండు మంది వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి రూ. 12,400 నగదును స్వాధీనం చేసుకున్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ



ప్రజాశక్తి-చల్లపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని ఎక్కడైనా కోడిపందాలు పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్య తీసుకుం టామని చల్లపల్లి ఎస్సై కే వై దాసు హెచ్చరిం చారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోడి పందాలు నిర్వహించే అనుమానం ఉన్న ప్రాంతాలలో హెచ్చరిక బ్యానర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కోడిపందాలకు ఎక్కడా అనుమతులు లేవని ఎవరైనా కోడిపందాలు పేకాట శిబిరాలు నిర్వహించే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : పమిడి ముక్కల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కడా కూడా జూద క్రీడలు నిర్వహించరాదని ఎస్ఐ బి. శ్రీను అన్నారు. శుక్రవారం ఆయన జూద క్రీడలు నిర్వహించకుండా పోస్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కోడీపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రామతులసమ్మకు నివాళి



ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని సావారుగూడెంకు చెందిన ఈలప్రోలు రామతులసమ్మ (91) వయోభారంతో గురువారం మృతిచెందారు. గ్రామంలో పాలసహకార సంఘం, అక్షర కృష్ణ గ్రంధాలయంలు స్థాపించిన రామతులసమ్మ మృతి గ్రామానికి తీరని లోటని వికెఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు మద్దుకూరి విజయకుమార్ అన్నారు. శుక్రవారం రామతులసమ్మ మృతదే హానికి నివాళులు అర్పించిన విజయకుమార్ మాట్లాడుతూ 1982లో నందమూరి తారకరామారావు పార్టీ స్థాపించిన నాటి నుండి చివరి వరకు టిడిపిలోనే ఉన్నారని అన్నారు. చనిపోయిన తర్వాత కూడా తన నేత్రాలను ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారని అన్నారు. శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో గన్నవరం మాజీ సర్పంచ్, మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసీ మోహన్, గ్రామ టిడిపి అధ్యక్షులు ప్రసాద్, పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ ఎంఇఓ కార్యాలయం వద్ద ఎస్‌టియు రాష్ట్ర సంఘ డైరీలు క్యాలెండర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ-2 బాలాజీ, ఎంఈవో -1 రజనీ ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, గుడివాడ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెజె డానియల్, పరస శ్రీను, జిల్లా నాయకులు ఐ.అరవింద్, పి.వి.ఎన్.డి.ప్రసాద్, నాగమణి, సుధారాణి, శ్రావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆవకాయ్' ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయవాడ : ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆవకాయ్.. సినిమా, సంస్కృతి, సాహిత్య అమరావతి ఉత్సవాలకు సమన్వయ శాఖల అధికారుల భాగస్వామ్యంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి హాల్‌లో ఆవకాయ్ ఉత్సవాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, టీమ్‌వర్క్ (సెలబ్రేటింగ్ ది ఆర్ట్స్) సంస్థ ప్రతినిధి సయ్యద్ శామ్స్‌తో కలిసి రెవెన్యూ, విఎంసి, పోలీసు, పర్యాటకం, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో సన్నద్ధతా సమావేశం నిర్వహించారు. పున్నమిఘాట్, భవానీ ద్వీపంలో జరిగే కార్యక్రమాలు, సందర్శకుల ఉచిత రిజిస్ట్రేషన్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సందర్శకుల భద్రత, ట్రాఫిక్ ప్రణాళిక, వేదికల వద్ద ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. గౌరవ ముఖ్యమంత్రితో పాటు ప్రముఖుల సందర్శన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపైనా సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతిని సాంస్కృతిక సాహితీ రాజధానిగా తీర్చిదిద్దేందుకు ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీసీపీ షేక్ షెరీన్ బేగం, అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

ప్రజాశక్తి-విజయవాడ : నగర మేయర్ చాంబర్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థలోని ఆయాశాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగుల సమక్షంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మీ కేక్‌ను కట్ చేశారు.



మేయర్‌కు అధికారులు, ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు సమ్వయంతో వ్యవహరిస్తూ నగరాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. రక్షిత మంచినీటి సరఫరా, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, ఆహ్లాదకరమైన వాతావరణంనకు ఉద్యానవనాల పెంపు తదితర వాటి సేవలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందించడానికి సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి.వెంకటనారాయణ, ఇన్చార్జి సెక్రెటరీ కె.ప్రభుదాస్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: హైదరాబాద్ ట్యాంక్ బండ్ సమీపంలో బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన పల్లెపొంగు తిరుపతయ్య, అతని భార్య వెంకటరమణ మృతి చెందారు. దంపతులిద్దరూ గత కొన్ని సంవత్సరాలు క్రితం హైదరాబాదులో



వాచ్మెన్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని కొన్ని ప్రాంతాలు చూడటానికి బైక్‌పై బయలుదేరారు. వీరి బైకును ట్యాంక్ బండ్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొడంతో తిరుపతియ్య అక్కడక్కడే మృతి చెందారు. ఆయన భార్య వెంకటరమణ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఇరువురి మృతదేహాలను శుక్రవారం వారి స్వగ్రామైన గండ్రాయి గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరికొత్త ప్యాక్‌లో గోద్రెజ్ జెర్సీ బాదం మిల్క్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఫ్లేవర్డ్ మిల్క్ కేటగిరీలో విప్లవాత్మకమైన మార్పునకు శ్రీకారం చుడుతూ రూ.20 ఖరీదు చేసే బాదం మిల్క్ 110 మిల్లీ లీటర్ల ప్యాక్‌ను గోద్రెజ్ జెర్సీ శుక్రవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ మార్కెటింగ్ హెడ్ రాజు మాట్లాడుతూ.. కేటగిరీ ఎంట్రీ ధరను రూ.10 మేర తగ్గిస్తూ, ఈ ధరలో లభిస్తున్న బాదం మిల్క్ ఇదే కావడం గమనార్హమని అన్నారు. ప్రత్యేకంగా జనరల్ ట్రేడ్‌లో ఆవిష్కరించబడిన గోద్రెజ్ జెర్సీ రూ.20 ఖరీదు చేసే బాదం మిల్క్ ఇప్పటికే తొలి 75 రోజుల్లో సుమారు 15,000 ఔట్‌లెట్స్‌కి చేరిందని గోద్రెజ్ జెర్సీ మార్కెటింగ్ హెడ్ శంతను రాజ్ తెలిపారు.

పెన్షన్లు మంజూరు చేయాలని ధర్నా



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కొత్త పింఛన్లు విడుదల చేయాలని కోరుతూ పెన్షన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం గొల్లపాలెం గట్టు రోడ్డు సాయిబాబా గుడి సెంటర్ వద్ద నిరసన తెలిపారు. పెన్షన్ సాధన కమిటీ కన్వీనర్ సిహెచ్ దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన సంవత్సరం తొలి రోజు కానుకగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని మంజూరు చేస్తారని ఎదురుచూసిన సుమారు పది లక్షల మందికిపైగా పెన్షన్‌కు అర్హులైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 50 ఏళ్ల పైబడిన వారందరికీ సామాజిక పింఛను అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. సదరన్ సర్టిఫికెట్ల సర్వే పేరుతో ఉన్న పింఛన్లు తొలగిస్తున్నారంటూ వికలాంగులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. కొత్త పింఛన్లు మంజూరు చేయడానికి ఖజానాలో డబ్బు లేవంటున్న ముఖ్యమంత్రికి వొడా కంపెనీకి వేల కోట్ల రూపాయలు మాఫీ చేయడానికి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయంటూ నిలదీశారు. భర్త చనిపోతే భార్యకు పెన్షన్ ఇస్తామంటూ ప్రభుత్వం పేర్కొనడం సరికాదన్నారు. ఈ సంక్రాంతి లోపు కొత్త పింఛన్లను మంజూరు చేయని పక్షంలో వృద్ధులు, వికంగులు, వితంతు మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు పైడి తాత్తయ్య మాట్లాడుతూ నాలుగువేల రూపాయలు పెన్షన్ హామీ వల్లే కూటమి నేతలు అధికారంలోకి వచ్చారన్న సంగతి గుర్తు చేశారు. మాజీ కార్పొరేటర్, ఐద్వా పశ్చిమ గౌరవ అధ్యక్షురాలు గాదె ఆదిలక్ష్మి మాట్లాడుతూ పెన్షన్ల మంజూరులో జాప్యం సహించబోమంటూ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ పెన్షన్ సాధన నగర నాయకులు కె.సూరిబాబు, ఎస్‌కె.బాజీ, వి.శ్యామల, జి.రాజేశ్వరి, వామపక్షాల నాయకులు పి.రాజు, ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ: ఎంపీ కేశినేని శివనాథ్, పశ్చిమ ఎంఎల్ఎ సుజనా చౌదరి నాయకత్వంలో ఊర్మిళా నగర్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు 43వ డివిజన్ టిడిపి అధ్యక్షులు మొరబోయిన రాంబాబు వెల్లడించారు. ఊర్మిళ నగర్ మసీదు రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించనున్న క్రమంలో శుక్రవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆ డివిజన్ టీడీపీ అధ్యక్షులు మోరబోయిన రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపి శివనాథ్, పశ్చిమ ఎంఎల్ఎ సుజనా చౌదరి ఊర్మిళ నగర్‌లో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.17.44 లక్షల నిధులను కేటాయించారని తెలిపారు. 43వ డివిజన్‌లో టిడిపి పటిష్టతకు చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఈ పురుషోత్తం, ఏఈ జాస్మిన్, స్థానిక టీడీపీ కార్యకర్తలు పెన్నా ఈశ్వరమ్మ, ఎం వెంకట్రాజు, పాల్గొన్నారు.

స్కూల్ బస్సు బోల్తా

- **40 మంది విద్యార్థులకు గాయాలు**

ప్రజాశక్తి - తిరువూరు

ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మొద్దుల గూడెం గ్రామంలోని వివేకానంద స్కూల్ బస్సు బోల్తా పడిన సంఘటనలో 40 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం స్కూల్ ముగిసిన అనంతరం స్కూల్ బస్సు సుమారు వంద విద్యార్థులను ఎక్కించుకుని వారివారి ఇళ్లకు వెళ్తుండగా ఆంధ్ర సరిహద్దు సమీపంలోని గణేష్‌పాడు ఎన్ఎస్‌పి కాలువ దగ్గర అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 40 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయపడిన 20 మంది పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో, మరో 20 మంది తిరువూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అందులో ఓ బాలిక తలకు బలమైన గాయమవడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆసుపత్రికి వచ్చి విద్యార్థులను పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. బస్సు డ్రైవర్ పరారయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు మేరిస్ స్టెల్లాలో ఖాదీ ఎగ్జిబిషన్

- **వందకు పైగా స్టాల్స్‌లో గ్రామీణ, ఖాదీ ఉత్పత్తుల ప్రదర్శన**

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఖాదీ పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యంతోపాటు, గ్రామీణ కళాకారుల జీవనోపాధి ప్రోత్సహించి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేలా ఖాదీ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఎస్.గ్రీప్ తెలిపారు. స్థానిక పడమట రామినేని వారి వీధిలోని ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ రాష్ట్ర సంచాలకులు ఎస్.గ్రీప్ ఖాదీ మహోత్సవం నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో పీఎంఈజీపి ఖాదీ మార్కెటింగ్ రాష్ట్రస్థాయి సంయుక్త మార్కెటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను శనివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక పంట కాలువ రోడ్డులోని మేరీ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ప్రదర్శనను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు నియోజకవర్గ



ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు ప్రారంభిస్తారన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులతో వందకు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ కళాకారులను ప్రోత్సహించేందుకు నగర ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, కొనుగోలు చేసి చేతివృత్తుల వారికి, హస్తకళాకారులకు చేయూతనందించాలని కోరారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ సహాయ సంచాలకుల ఆర్.ఎల్. ఎన్. మూర్తి మాట్లాడుతూ తయారీదారులు, కళాకారుల ప్రతిభను చాటేందుకు ఈ వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పొందూరు ఖాదీ, ధర్మవరం సిల్క్, కలంకారీ ప్రింటింగ్, చెక్క బొమ్మలు, చేతితో తయారు చేసిన వైవిధ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని, వాటిని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామకు చెందిన విజయవాడ క్రైమ్ డిపార్ట్మెంట్ హెడ్ కానిస్టేబుల్ మాతంగి సుధీర్ కుమార్ (45) విధి నిర్వహణలో ఉండగా శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని నందిగామ పట్టణం మధిర ఆర్చ్ రోడ్డు వద్ద ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుధీర్ కుమార్ అకాల మరణం పోలీస్ శాఖకు, సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సుదీర్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి, తదిరులు ఉన్నారు.

కొండపల్లి మున్సిపల్ కార్యాలయానికి దాత పేరు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపల్ కార్యాలయానికి అక్కల గంగాధర్ నాయుడు పేరు పెట్టడం హర్షణీయమని జనసేన నేత అక్కల రామమోహన్ రావు(గాంధీ) తెలిపారు. మున్సిపల్ కార్యాలయం కోసం విలువైన స్థలాన్ని దానం చేసిన గంగాధర్ నాయుడు కొండపల్లి



పంచాయితీ మొదటి సర్పంచ్‌గా, జిల్లా బోర్డు సభ్యులుగా ప్రజలకు విలువైన సేవలందించారని కొనియాడారు. ఆయనకు సముచిత స్థానం అందించి, గౌరవం అందేలా స్థల దాత పేరు కార్యాలయానికి పెట్టడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. స్థల దాత గంగాధరరావు నాయుడు (మునసుబు) వారసులు అక్కల ప్రసాద్, అక్కల సత్యనారాయణ, అక్కల వరప్రసాద్ మున్సిపాలిటీ పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దాత పేరు గుర్తుంచుకొని, బాధ్యతగా పేరు పెట్టిన స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, చైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. నాడు పంచాయితీ కార్యాలయం కోసం సుమారు 20 సెంట్లు మేర స్థలాన్ని, కచేరి కింద 3 సెంట్లు (ప్రస్తుతం రూ.5 కోట్లు విలువ చేసే) స్థలాన్ని దానం చేసిన గంగాధర్ నాయుడు కొండపల్లిలో మరికొన్ని భూములు ప్రభుత్వ అవసరాల కోసం దానం చేశారని తెలిపారు. ప్రస్తుత మున్సిపాలిటీ పాలకవర్గం బాధ్యతగా స్థల దాత పేరు పెట్టడం ఇతరులకు ఆదర్శమని కొనియాడారు.

న్యూ కియా సెల్టోస్‌ను ఆవిష్కరించిన కియా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

కియా ఇండియా ఆల్ న్యూ కియా సెల్టోస్ తన ధరలను ప్రకటించిదని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గంగూలీ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని షో రూమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. మిడ్ ఎస్‌యువి విభాగంలో ఒక బలమైన ముద్ర వేస్తూ వినియోగదారులు తమకు ఇష్టమైన ఎస్‌యువిని సొంతం చేసుకునేందుకు రూ.10.99 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరతో ఒక ఆకర్షణీయమైన అవకాశాన్ని అందిస్తోందని తెలిపారు. రెండో తరం, బిగ్గర్, బోల్డ్, మరింత ప్రోగ్రెసివ్ ఎస్‌యూవీని విస్తృత శ్రేణి కస్టమర్లకు అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా కియా ఈ విభాగాన్ని నిర్ణయాత్మకంగా పునర్నిర్వచిస్తోందని తెలిపారు. ఆల్ న్యూ కియా సెల్టోస్ ఆధునిక భారతీయ కుటుంబాలు, ఎస్‌యూవీ కొనుగోలు దారులకు అత్యంత సంపూర్ణ, ఆకర్షణీయమైన ఎంపికలలో ఒకటిగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటుందని, అసాధారణమైన ధర వద్ద స్పేస్, అధునాతనత, భద్రత, సాంకేతికతల పరిపూర్ణ మిశ్రమాన్ని అందిస్తోందని తెలిపారు.

సబ్సిడీ వాహనాలు పొందేందుకు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎన్టీఆర్ జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువత సబ్సిడీ పై (4) మురుగు శుద్ధి వాహనాలు పొందేందుకుకై దరఖాస్తు చేసుకునే గడువును జనవరి పదో తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాల కులు షేక్ షాహిద్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్‌కెఎఫ్ డి సి పథకం ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వాహన వ్యయం 31,67,326 రూపాయలు అని, ఇందులో 14,16,831.50 రూపాయల సబ్సిడీ లభిస్తుందన్నారు. మిగిలిన 17,50,494.50 రూపాయల మొత్తాన్ని ఎన్ ఎస్ కె ఎఫ్ డి సి రుణం గా పొందవచ్చని తెలిపారు. ఆసక్తి, అనుభవం, అర్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 10 తేదీ లోపు, నేరుగా జిల్లా ఎస్. సి .కార్పొరేషన్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 9652057244 నంబర్ ను సంప్రదించాలని తెలిపారు.



కేలండరు ఆవిష్కరిస్తున్న దృశ్యం

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా యుటిఎఫ్ క్యాలెండరును అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కనకారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, పలువురు జిల్లా నాయకులు, మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్మిక సంఘం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కమిటీ ముద్రించిన 2026 క్యాలెండర్ ను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శిలు శీలం నారాయణరావు, పి. పవన్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు అజ్మీర్ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి : కలెక్టర్



పోస్టరు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ హాలులో స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ బాల్య వివాహ ముక్తా భారత్ గోడపత్రాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పిడి ఐసిడిఎస్ పి డి ఎం ఎన్.రాణి, నోడల్ అధికారి సుధారాణి, ఈవో విజయ లక్ష్మి జిల్లాలోనీ 8 ప్రాజెక్ట్ ల సిడిపిఓలు , శిశు సంరక్షణ అధికారికిషోర్ , సంరక్షణ అధికారులు మధుబాబు,ప్రశాంతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్తాచెదారంతో దుర్గంధం



ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ శివారు హెూలీ స్పిరిట్ హై స్కూల్ 50 గజాలు ఆర్ అండ్ బి రోడ్డు పక్కన మరియు ఆర్సీఎం చర్చి రహదారి పక్కన చెత్త చెదారంతో దుర్వాసన వ్యాప్తి చెందుతోంది. అర్ అండ్ బి రహదారిపై ప్రయా ణించే వాహనదారులు సమీపంలో పాఠశాల విద్యార్థులు, ప్రయాణదారులు ఇబ్బంది గురవు తున్నారు. జంతు కళేబరాలు కోసం వీధి కుక్కలు గుంపులుగా చేరి ద్విచక్రవాహనాలకు అడ్డుపడు తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మొవ్వ పంచాయితీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డి.ఎల్‌పిఓ. ఆదేశాలతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసినా మరల యధాతధంగా మారడంతో ఆ రోడ్డుపై తిరగాలంటేనే అంటు రోగాలు వస్తాయేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పరిశుభ్రతకు తగుచర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



పామర్రులో పాస్‌పుస్తకాలు అందిస్తున్న ఎంఎల్ఎ వర్ల



గుడ్లవల్లేరులో పాస్‌పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలంలో 2023 సంవత్సరంలో రిసర్వే జరిగిన పొలాలకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను పెడసనగల్లులో 716 మందికి, బార్లపూడిలో 191 మందికి పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల తహసిల్దార్ కే మస్తాన్, ఆర్ఐ ఏ విజయదుర్గ, సర్పంచ్లు కైతేపల్లిఅన్నామణి (పెడసనగల్లు), కే ఎల్ వి ప్రసాద్ (బార్లపూడి), సచివాలయ సర్వేయర్ బి రామ శివప్రసాద్, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎంపీసీ.ఎస్. అధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** భూమి కలిగిన వారు తమ భూమి మీద పూర్తి హక్కు కలిగి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధిలోని ఎలకుర్రులో 303,నెమ్మలూరులో 392, ప్రాకర్లలో 212 కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవికాంత్, ఆర్ ఐ రాము, పామర్రు మార్కెట్ యార్డ్ చైర్మన్ జన్ను శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో తహసీల్దారు బి.లోకరాజు, ఎంపీడీవో ఎండి ఇమ్రాన్, గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి ప్రసాద్ దంపతులు, ఉలవలపూడి సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు, సర్పంచ్ చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు నాగు, విఆర్ఓ శాయన ప్రకాష్, మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, పిఎసిఎస్ అధ్యక్షుడు వెనిగండ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన 104 సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : 104లో తొలగించిన బఫర్ ఉద్యోగస్తులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కృష్ణా జిల్లా 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అర్జా మురళీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104లో ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మచిలీపట్నం సిఐటియు కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ భవ్య యాజమాన్యం 104 ఉద్యోగుల కు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం ఎన్ని సార్లు యాజమాన్యం తో కలిసి విన్నవించిన ఫలించలేదన్నారు. తప్పని సరి పరిస్థితి ల్లో 104 ఉద్యోగులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భవ్య యాజమాన్యం తగ్గించిన వేతనాలు, సవరించి పూర్తి వేతనాలు చెల్లించాలని, దానితో పాటుగా ప్రభుత్వం కూడా జీతాలు పెంచే ఆలోచన చెయ్యాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్ల వినయ్ మాట్లాడుతూ తొలగించిన క్యాజువల్ లీవ్ లు పునరిద్దరించాలన్నారు. అన్ని ప్రభుత్వ సెలవులు 104 కి కూడా వర్తింప చెయ్యాలని డిమాండ్ చేశారు. ఎం పోలి నాయుడు మాట్లాడుతూ తొలగించిన బఫర్ సిబ్బందిని తిరిగి నియమించి ఉద్యోగుల మీద పని ఒత్తిడి తగ్గించాలన్నారు. సిఐటియు నగర కన్వీనర్ చిరువోలు జయరావు, 108 ఉద్యోగుల కృష్ణాజిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి , కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కేవీ గోపాల్ రావు, టెలిఫోన్ ఉద్యోగ సంఘం పట్టణ అధ్యక్షులు ఎంఎ బెనర్జీ , కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్, 102 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అయ్యప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలి : డిఇఒ



మధ్యాహ్నం భోజనం రుచి చూస్తున్న డిఇఒ సుబ్బారావు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పదో తరగతి పరీక్షల ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపర్చాలని జిల్లా విద్యాశాఖాధికారి యువి. సుబ్బారావు సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ పార్క్ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల అభ్యాస స్థాయిని సమీక్షించి, అసెస్‌మెంట్ పుస్తకాలు, నోట్స్ కరెక్షన్‌లు, ఇతర అకడమిక్ రికార్డులను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులతో నేరుగా మాట్లాడి, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించి భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల ఉపాధ్యులకు డీఈఓ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఈఓ శేఖర్ సింగ్,తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఎన్‌టిఆర్ స్టేడియంలో కబడ్డీ టోర్నమెంట్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని రాష్ట్ర పాఠశాల క్రీడల కార్యదర్శి భాను మూర్తి రాజు తెలిపారు. 69వ జాతీయ పాఠశాల క్రీడల అండర్-14 బాలికల కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించి శుక్రవారం పార్క్ మున్సిపల్ హై స్కూల్లో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 19 నుంచి 23 వ తేదీ వరకు గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నామన్నారు. అధికారులు నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని విభాగాలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి యువి. సుబ్బారావు, మండల విద్యాధికారులు, హెడ్‌మాస్టర్లు, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు పుట్టినరోజు వేడుకలు పోరంకిలోని టిడిపి కార్యాలయంలో వైభవంగా నిర్వహించారు. శాసన సభ్యులు బోడే ప్రసాద్, ఆయన కుమారుడు బోడే వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రంగారావుకు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బోడే ప్రసాద్ మాట్లాడుతూ రంగారావు పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్త స్థాయి నుండి నియోజవర్గ బీసీ అధ్యక్షుడు స్థాయికి ఎదిగాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్,రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పితా గోపీచంద్, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి, ఏఎంసీ చైర్మన్ అనే ధనయ్య, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ కొండ ప్రవీణ్, పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

పెసలు కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి-కంచికచర్ల : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. కంచికచర్ల మార్కెట్ యార్డులో శుక్రవారం మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కనీస మద్దతు ధరపై క్వింటాకు రూ.8,768లతో ఏర్పాటు చేసిన పెసలు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కనీస మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని, దళారుల మోసాలకు తావు లేకుండా నేరుగా ప్రభుత్వం నుంచే మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డిఎం మల్లిక, కంచికచర్ల మార్కెట్ పాలకవర్గం, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్, కూటమి నేతలు, వివిధ హోదాలు కలిగిన కూటమి నేతలు, యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, మార్కెట్ యార్డు సిబ్బంది, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని కనుమూరి గ్రామానికి చెందిన కామ్రేడ్ చెరుకు వెంకటరామిరెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు కామ్రేడ్ చెరుకు వీరారెడ్డి 50 మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు శుక్రవారం దుప్పట్లు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చెరుకు నరసారెడ్డి అత్తునూరు, వెంకటశివారెడ్డి, సిపిఎం నాయకులు జానపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న డిసిపి, ఎసిపి

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ తిలక్, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పెను గంచిప్రోలు ఎస్ఐ అర్జున్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికి, వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు భద్రతా నియమాలపై సదస్సు

ప్రజాశక్తి - తిరువూరు : ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని తిరువూరు సర్కిల్ పోలీస్ ఇన్స్పెక్టర్ గిరిబాబు సూచించారు. తిరు వూరు ఆర్టీసీ డిపోలో శుక్రవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గిరిబాబు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ప్రమాదాల నివారణకు తమవంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. డ్రైవర్లు బస్సును నడిపేటపుడు తన కుటుంబాన్ని, ప్రయాణీకులను, రోడ్డుపై వెళ్ళే వారిని దృష్టిలో ఉంచుకోవాలని, అప్పుడే ప్రమాదాలు జరగవని తెలిపారు. తిరువూరు ఎస్ఐలు విశ్వ శాతక్ష, రాజు, తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైకు బహూకరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని పోచంపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)కు పోచంపల్లి గ్రామానికి చెందిన తేల్లూరి గోవిందరెడ్డి శుక్రవారం మండల విద్యాశాఖాధికారి ఎల్ చిట్టిబాబు సమక్షంలో రూ.17,500 విలువ చేసే మైకును పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా దాత తేల్లూరి గోవిందరెడ్డి మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తమ వంతు సహాయం చేయాలనే సదుద్దేశంతో మైకును బహూకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఏవై శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యాయులు అల్లిక నరసింహారావు, కొమరగిరి గంగాధరరావు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-మైలవరం : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు శుక్రవారం ఉదయం హాస్పిటల్ వద్ద నిరసన చేపట్టారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సుధాకర్ మాట్లాడుతూ పండుగల సమయంలో కూడా పెండింగ్ జీతాలు చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేయటం దారుణమని అన్నారు. కాంట్రాక్ట్ ముగియడంతో పాత కాంట్రాక్టర్ జీతాలు చెల్లించకుండానే పెండింగ్లో పెట్టి వదిలేసాడని, కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ తక్షణమే పెండింగ్ జీతాలు, పీఎఫ్ నిధులు జమ చేయాలని, యూనిఫామ్, సేఫ్టీ ఎలిమెంట్స్, నాలుగు రోజుల పాటు సెలవు దినాలు, సౌకర్యాలు తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్స్



శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు వంగూరి రమేష్ బాబు, వరాగల రుతమ్మ, సూపర్వైజర్ రావూరి, దయాకర్, చింతల తిరుపతయ్య, చింతల అనసూయ, పి రమణ, కే శారమ్మ, టి మేరీ, ఎల్ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ రూరల్ డిసిపి లక్ష్మి నారాయణ శుక్రవారం వార్షిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. శాంతి భద్రతల విషయంలో అలసత్వం వహించవద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఏసిపీ తిలక్, నందిగామ రూరల్ సిఐ చవాన్, ఎస్సైలు విశ్వనాథ్, నరేంద్ర నాని పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై క్రమశిక్షణ చర్యలు



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలోని 40వ నెంబర్ రేషన్ షాప్‌ను శుక్రవారం ఆర్డీఓ కె.మాధురి తనిఖీ చేశారు. షాప్‌లో సుమారు 450 కిలోల రేషన్ బియ్యం వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించి సంబంధిత డీలర్‌పై క్రమశిక్షణా చర్యలు, బి.ఫారం లైసెన్స్ రద్దుకు తగు నివేదిక ఇవ్వాలని పీడీఎస్ డిటిని, తహాశీల్దార్‌ను ఆర్డీఓ ఆదేశించారు. తిరువూరు డివిజన్‌లోని డీలర్లు అందరూ సకాలంలో రేషన్ దుకాణాలు తెరచి కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రేషన్ పంపిణీ చేయాలని, ఎవరైనా డీలర్లు అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ తహాశీల్దార్ నాగమణి, డిటి శ్వేత, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-మైలవరం : ప్రమాదాల నివారణకు డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్.శివరాం గౌడ్, ఎండి ఆలీ పేర్కొన్నారు. 37వ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని డ్రైవర్ల కోసం రోడ్డు భద్రతా ప్రమాదాలను నివారించడం అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాం గౌడ్ మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎమ్‌డి అలీ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదని, సీట్ బెల్ట్ ధరించటం వలన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రజలు కూడా బాధ్యతగా మెలిగి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్‌రెడ్డి, డా.ఎస్.రామిరెడ్డి, పాల్గొన్నారు.

రోబోటిక్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-మైలవరం : స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోబోటిక్ అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే వర్క్ షాప్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు యంత్రాలైన రోబోలను తయారు చేయటం, వాటిని ఉపయోగించటంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ పరిశోధన వంటి రంగాలలో రోబోటిక్ ఉపయోగం చాలా ఉందన్నారు. ప్రమాదకరమైన ప్రాంతాలలో పనిచేయటానికి చిప్పింగ్, డెలివరీ వంటి లాజిస్టిక్స్ రంగాలలో రోబోటిక్స్ కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ ఉమాలక్ష్మి, డాక్టర్ ఫణి కుమార్, డాక్టర్ రాముడు, డాక్టర్ వెంకటాద్రి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సుభాషిని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన గుంటుపల్లి డాన్ బాస్కో స్కూల్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మధిరకు చెందిన బాబురావు తన కుటుంబ సభ్యులతో కలిసి స్కూటీపై విజయవాడ గొల్లపూడి వస్తున్నారు. గుంటుపల్లి డాన్ బాస్కో స్కూల్ వద్దకు చేరుకోగానే విజయవాడ వైపు వెళుతున్న టిప్పర్ లారీ స్కూటీని ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా గుంటుపల్లి పిఎం స్కూల్ నుండి స్కూల్ పిల్లల్ని తీసుకువేళ్ళే ఆటోని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న బాబురావు మృతి చెందగా, ఆయన భార్య, పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న స్కూల్ పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తిరువూరు బాలోత్సవం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో తిరువూరు బాలోత్సవం 4వ పిల్లల పండుగ ఈ నెల 3న తిరువూరు నియోజకవర్గస్థాయిలో జరుగుతుందని బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎం.హరికృష్ణ తెలిపారు. ఉదయం 9 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు బాలోత్సవ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు పెంచడం, ఒత్తిడికి దూరంగా ఆహ్లాదకరంగా గడిపేందుకు నిర్వహించే ఈ బాలోత్సవాలలో 24 అకడమిక్, 8 సాంస్కృతిక విభాగాలలో పాల్గొనేందుకు నియోజక వర్గంలోని నాలుగు మండలాలలోని 61 పాఠశాలల నుండి 2032 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నార న్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆర్డీఓ కె.మాధురి, తిరువూరు, నందిగామ డివైఈఓలు సాంబశివరావు, శ్యాంసుందర రావు హాజరవుతారని తెలిపారు.



దెబ్బతిన్న రోడ్లు పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని 1వ వార్డులో మట్టి రోడ్లను శుక్రవారం పట్టణ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, శ్రీరాం సాయి ప్రసాద్‌లు పరిశీలించారు. కోదాడ రోడ్డులోని ఇండోర్ స్టేడియం మున్సిపల్ స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలో మట్టి రోడ్లు దెబ్బతిని ఆ ప్రాంతం గుండా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు గురవుతున్న నేపథ్యంలో అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర అధికారులతో మాట్లాడుతూ.. గోతులు పడిన నాలుగు మట్టి రోడ్లను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేయడానికి అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. సాధ్యమైనంత తొందరలో సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

నేడు రెడ్డిగూడెంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎఇ కిరణ్ కుమార్ తెలిపారు. రెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం ఆర్డీఎస్ఎస్ పనుల కారణంగా ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదనీ, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బలుసుపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, అలాగే రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన 5 గోకులం షెడ్లను ప్రారంభించారు. అన్నవరం గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, పంచాయతీరాజ్ ఎఈ శ్రీనివాసరావు, జగ్గయ్యపేట మండల టిడిపి అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, కృష్ణ, ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ యానాల గోపీచంద్, కాచవరం కాలువ చైర్మన్ కానూరి కిషోర్, డోగుపర్తి విష్ణు, సర్పంచ్ మీగడ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

రైతులకు పాసు పుస్తకాలు అందజేత



ప్రజాశక్తి-గంపలగూడెం, తిరువూరు : వైసిపి ప్రభుత్వం అప్పటి సిఎం ఫోటోతో ఇచ్చిన పాస్ పుస్తకాలను మార్చి నూతనంగా రాజముద్రతో రైతులకు పాస్ పుస్తకాలు అందజేస్తున్నట్లు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కనుమూరు, అనుములంక గ్రామాల్లో కొంతమంది రైతులకు పాసు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా రీ సర్వేలో వచ్చిన పాత పాస్ పుస్తకాలను రెవెన్యూ కార్యాలయంలో అందజేసి రాజముద్రతో కూడిన డిజిటల్ పాస్ పుస్తకాలను పొందాలని తహాశీల్దార్ రాజకుమారి రైతులకు పిలుపునిచ్చారు.

తిరువూరులో..: భూముల రీ సర్వే పూర్తయిన మండలంలోని 8 గ్రామాల్లోని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నట్లు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ మరకాల వెంకటేశ్వరరావు తెలిపారు. దానిలో భాగంగా శుక్రవారం వాముకుంట్ల సచివాలయంలో గ్రామసభ నిర్వహించి 885 మంది రైతులకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేతుల మీదుగా పాసు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆర్ఐ తెలిపారు. 3న ఆంజనేయపురం, 6న చిట్టేల, 7న ముష్టికుంట్ల గ్రామాల్లో గ్రామసభల ద్వారా పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి రమణి

మినుము సాగుపై అవగాహన

ప్రజాశక్తి - గుడివాడ : రైతులు యాజమాన్య పద్ధతులపై ఆధారపడకుండా సొంతంగా వ్యవసాయం చేస్తే దిగుబడి పెరుగుతుందని వ్యవసాయశాఖ జిల్లా కో- ఆర్డినేటర్ జ్యోతిరమణి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కో - ఆర్డినేటర్ జ్యోతిరమణి, సహాయ కో -ఆర్డినేటర్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ మినుము పంటకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ కవిత, మండల వ్యవసాయాధికారిణి అనంతలక్ష్మీ, పద్మజా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు మండలం చినఓగిరాల పరిధి పెదఓగిరాల డొంకరోడ్డులో రూ.18 లక్షలతో అధునాతన టెక్నాలజీ (సాయిల్ స్టెబిలైజేషన్) ఉపయోగించి చేస్తున్న రోడ్డు అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ శుక్రవారం పరిశీలించారు. రోడ్డుపనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అధునాతన టెక్నాలజీతో రోడ్డు అభివృద్ధి చేయడం మన్నిక, సామర్థ్యం అంచనా వేయాలని సూచించారు. నల్లమట్టి, రబ్బీస్, సిమెంట్ లేయర్లగా వేయడం వల్ల ప్రయోజనాన్ని ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. ఇంజనీర్ ఇన్ చీఫ్



పనులు పరిశీలిస్తున్న కృష్ణతేజ

బాలూనాయక్, ఎస్ఈ రమణరావు, పీడీ శివప్రసాద్, డీఈ శ్రీనివాస్, పీడీఈ రాజశేఖర్రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కుటుంబరావు, పాలడుగు అశోక్ పలువురు రైతులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- గన్నవరం : గన్నవరం నియోజకవర్గ అభివృద్ధే తన కర్తవ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. శుక్రవారం గన్నవరం మండలంలోని కొత్తగూడెం, తెంపల్లె గ్రామాల్లో పర్యటించి రూ.85 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా రూ.1.85 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్‌ను ప్రారంభించి, రూ.10 లక్షలతో నిర్మించబోయే మరో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. తరువాత నిర్వహించిన రీ-సర్వే గ్రామ సభలో పాల్గొని, రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టా పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఫరీన్, మండల తహసీల్దార్ కే. శివయ్య, ఎండిఒ స్వర్ణలత, ఏఎంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ప్రత్యేక అధికారి షాహిద్ బాబు, గన్నవరం మండల టీడీపీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పేదల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ వైసిపి కృషి చేస్తుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని తాడంకిలో జడ్పిటిసి ఏసుగ వెంకటరమణ కుమారి గృహం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైఎస్‌ జగన్మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాలు చేశారని ఆయన అన్నారు. ఏసుగ నాగేశ్వరావు వంద సంవత్సరాల పుట్టినరోజు వేడుకలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డాక్టర్స్, వైద్య సిబ్బంది, మండల వైయస్సార్ పార్టీ నాయకులు ఎలమంచిలి గణేష్, పెనుముచ్చు రమేష్, తిరుమల శెట్టి బోసు బాబు, రాణి పద్మ, ఏసుగ మస్తాన్ రావు పాల్గొన్నారు



జనసేనలో చేరిక

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ / మచిలీపట్నంఅర్బన్: మచిలీపట్నం మండలం బుద్దాలపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు జొన్నల మారయ్య జనసేన పార్టీలో చేరారు. గ్రామ జనసేన పార్టీ ఇంచార్జ్ పిఎసిఎస్ చైర్మన్ కొక్కు లక్ష్మణరావు ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆపార్టీ బందరు ఇంచార్జ్ బండి రామకృష్ణ మారయ్యకు జనసేన పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు గడ్డం రాజు, బుద్దాలపాలెం మాజీ పి ఎసిఎస్ చైర్మన్ వాలిశెట్టి నాగేంద్రం, కొక్కు శ్యామలరావు, కొరారి వాకలరావు పాల్గొన్నారు.

ఎంపికి సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నూతన సంవత్సరం సందర్భంగా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన తనయుడు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మచిలీపట్నంలో ఎంపీ బాలశౌరిని తమ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేలు, హైవే అథారిటీ అధికారుల సమావేశంలో ఆయన కలిసి సత్కరించినట్లు తెలిపారు.



ఎంపిని సత్కరిస్తున్న బుద్ధప్రసాద్, వెంకట్రాం



ప్రమాదబీమా అందిస్తున్న ఎంఎల్ఎ బోడేప్రసాద్

ప్రమాద బీమా అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో తాడిగడప గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త బంద్రపల్లి సుబ్బారావు ఇటీవల మృతిచెందడంతో టిడిపి ప్రమాదబీమా ఉండడంతో ఆయన భార్య కోటేశ్వరమ్మకు 5 లక్షల రూపాయల బీమా నగదు ధృవీకరణ పత్రం ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉండేలా బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కడవకొల్లు నరసింహారావు

దివిసీమ అభివృద్ధే లక్ష్యం : కడవకొల్లు

ప్రజాశక్తి-అవనిగడ్డ : నూతన సంవత్సర వేడుకలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఏఎంసి మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు ఇంటివద్ద కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ పార్టీపై విశ్వాసం, నాయకత్వంపై అభిమానాన్ని చాటుతూ అవనిగడ్డ రాజకీయాల్లో వైసిపి శక్తివంతంగా ఉందని మరోసారి నిరూపించారని, దివిసీమ అభివృద్ధి తన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి, కోడూరు, అవనిగడ్డ, మోపిదేవి మండల పార్టీల అధ్యక్షులు శీలం సత్యనారాయణ, పరిసే మాధవరావు, రేపల్లె శ్రీనివాసరావు, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతి దేవి, తుంగల అంకారావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ నజీర్ భాష, పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో 11 అర్జీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 11 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అందులో పెన్షన్ల కొరకు, రహదారుల నిర్మాణం కోసం, శిస్తు రసీదులకు సంబంధించి న సమస్యలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదపాలెం సర్పంచ్ దున్న రాజేష్, టిడిపి నాయకులు మండలి రామ్మోహన్రావు కొల్లూరి బసవేశ్వర రావు, గుంటూరు వినయ్, నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ చట్టం పేరు మార్పుపై 5న నిరసనలు

ప్రజాశక్తి-మొవ్వ : కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని మార్చి జి రామ్ జి పేరుతో నూతన పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ జనవరి 5న జిల్లాలో అన్ని గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో నిరసన తెలియజేస్తున్నట్లు ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన పథకంలో రాష్ట్రాలపై భారాలు మోపుతూ భవిష్యత్తులో గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులకు పని దినాలు తగ్గే పరిస్థితి ఉందన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం : కఠారి

ప్రజాశక్తి - గుడివాడ : బిసిలు ఐక్యతతో ముందుకు వెళ్ళాలని మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బైయ్యావారి వీధిలోని మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్‌ను ఆయన స్వగృహంలో బిసి సంఘం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ దారం నాగరాణి ఆధ్వర్యంలో బిసి సంఘంలోని మహిళలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలు ఐక్యతతో ఉంటే సమస్యలను పరిష్కరించు కోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు పంది మోహనరావు, నెరుసు లక్ష్మీరాజ్యం, డొక్కు లక్ష్మీ, కఠారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాజీ మంత్రిని కలిసిన బిసి నాయకులు

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరంలో చెరువు పక్కన ప్రధాన రహదారి (క్లబ్ రోడ్) నిర్మాణానికి అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ఉదయం భూమిపూజ చేశారు. రోడుడ నిర్మాణానికి పల్లెపండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకం నిధులు రూ. 45 లక్షలు మంజూరయ్యాయి. అనంతరం లక్ష్మీపురంలో ఉపాధి నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వివిధ సొసైటీ ఛైర్మన్లు, కూటమి నేతలు మరియు అధికారులు పాల్గొన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

అవసరం మేరకు యూరియా వాడాలి : ఎఒ

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని అన్ని గ్రామాల్లోని సొసైటీలల యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సుధారాణి తెలిపారు.శుక్రవారం ఆమె మాట్లాడుతూ రైతులు అవసరమైన మేరకే యూరియా వాడాలన్నారు. అధికంగా యూరియా వాడడం వల్ల మట్టిలో చౌడు పెరిగి సూక్ష్మ జీవులు చనిపోతాయన్నారు. నీటిపై అధికంగా వాడటం వలన భూగర్భ జల కాలుష్యం పెరిగి అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతాయన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ ఫిర్యాదులను వేగంగా, నాణ్యతతో పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఈ క్లినిక్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. తహశీల్దార్లు, ఆర్‌డీవోలు, రెవెన్యూ అధికారులు గ్రామాలకు సంబంధించిన అన్ని రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రిసెప్షన్, రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో సరైన విధంగా అర్జీల నమోదు, రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. అర్జీదారులు సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన పత్రాలను ఇవ్వాల్సిందిగా పిటిషనర్‌కు మార్గనిర్దేశం చేయాలన్నారు. తర్వాత విచారణ సిబ్బంది టేబుల్ వద్దకు వెళ్లాల్సిందిగా అర్జీదారునికి సూచించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి సానుభూతితో పాటు స్పష్టత, పారదర్శకత అధికారులకు అవసరమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. అడంగల్‌లో తప్పుల సవరణ, భూ వ్యత్యాసాలు, భూ వర్గీకరణ, విస్తీర్ణ సవరణ, సర్వే నంబరు తప్పులు మొదలైనవి, ఎఫ్ లైన్ అర్జీలు, రీసర్వే, జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు, 22ఏ నిషేధిత భూముల రిజిస్టర్ నుంచి పట్టా భూములను తొలగించుట, ఆక్రమణల తొలగింపు, డీ పట్టా సమస్యలు, ఇళ్ల స్థలాల పట్టాలు, భూ సేకరణ సమస్యలు, ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యలు రెవెన్యూ క్లినిక్‌ల్లో పరిష్కారమవుతాయని తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి జైలు

ప్రజాశక్తి-విజయవాడ : బాలికను మానభంగం చేసిన కేసులో నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.పది వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జ్ వేల్పుల భవాని శుక్రవారం తీర్పునిచ్చారు. స్థానిక భవానీపురంలో 2024 సెప్టెంబర్ 9న ఐదు సంవత్సరాల బాలికపై షేక్ ఖాసిం అనే వ్యక్తి అత్యాచారానికి ఒడిగట్టడంతో బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోక్సో యాక్ట్‌గా కేసు నమోదుచేసి పోలీసులు విచారించారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువైనందున శుక్రవారం విజయవాడ పోక్సో కోర్టు జడ్జి వేల్పుల భవానీ ముద్దాయి షేక్ ఖాసింకు జైలు శిక్ష , జరిమానా విధించారు. అదేవిధంగా బాధిత బాలికకు రూ.ఐదు లక్షల పరిహారం అందించాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ ఆథారిటీని ఆదేశించారు.

పోలియో నిర్మూలనకు రోటరీ కృషి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : దేశంలో పోలియో నిర్మూలనకు తమ వంతు విరాళాలు సేకరించేందుకు రోటరీ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు రోటరీ 3020 జిల్లా గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ ఫెయిర్ ద్వారా వచ్చిన నగదును పోలియో నిర్మూలన కోసం ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మూడు రోజులపాటు జరగనున్న రోటరీ ఫెయిర్‌ను రోటరీ థర్టీ-20 జిల్లా గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను పరిశీలించారు. సమాజ సేవలో రోటరీ క్లబ్‌లు ముందంజలో ఉంటాయని తెలిపారు. అనంతరం రోటరీ ఫెయిర్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్‌లు అమూల్య శ్రీనివాస్, చిన్నం మధుబాబు, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల రెండవ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు రోటర్ ఫెయిర్ జరుగుతుందని తెలిపారు.



ఘనంగా రాధాకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భవానీపురం లక్ష్మీ నగర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్ నివాసంలో శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్. బేగ్‌తోపాటు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు రాధాకృష్ణ పుట్టినరోజు వేడుకలలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



దేశానికి ఆదర్శంగా భూ యాజమాన్య వ్యవస్థ

- కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి-కంచికచర్ల : దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్య వ్యవస్థను మరింత పారదర్శకంగా, రైతుల శ్రేయస్సు లక్ష్యంగా తీర్చిదిద్దుతోందని, ఆధునిక సాంకేతికత అనుసంధానంతో భూమి యాజమాన్య హక్కు పత్రం, పట్టాదారు పుస్తకాలను రాజముద్రతో అందిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కంచికచర్ల మండలం పెండ్యాలలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. భూ యజమానులకు హక్కు పత్రం, పట్టాదారు పుస్తకాలను ఇకెవైసితో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల డిజిటలైజేషన్, సాంకేతిక ఆధునికీకరణ డేటా ద్వారా భూసంబంధిత వివాదాలకు చెక్ పెట్టడంతోపాటు రైతులకు వేగవంతమైన సేవలు అందనున్నాయని వివరించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు సరికొత్త పట్టాదారు పుస్తకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. భూసంబంధ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, గ్రామాలను భూ వివాద రహితంగా మార్చేందుకు ఈ పాసుపుస్తకాలు దోహదం చేస్తాయని,



హద్దులను మార్చేయడం వంటి మోసాలు కుదరవని స్పష్టం చేశారు. వరదలు వంటి విపత్తులు వచ్చినా అత్యంత కచ్చితత్వంతో మన భూములు, మన హద్దులు భద్రంగా ఉంటాయని వివరించారు. భూ సమాచారం డేటా సెంటర్‌లో భద్రంగా ఉంటుందని, ఈ డేటాతో రైతులు సత్వర సేవలు పొందేందుకు వీలుంటుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. గ్రామాన్ని ప్రగతి దిశగా నడిపించాలి: మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న పెండ్యాల గ్రామాన్ని మరింత ప్రగతి దిశగా నడిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి వై.మోహన్‌రావు, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, గ్రామ సర్పంచ్ షబ్బీర్ పాషా, తహశీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ : నగరపాలక సంస్థ సర్కిల్-2లో శుక్రవారం మొబైల్ కోర్టులో న్యాయమూర్తి జి లెనిన్‌బాబు 11 కేసులను విచారించి, రూ.3,100 జరిమానాను విధించారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ రోడ్లపై మాట్లాడుతూ చెత్త వేసినా, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని వదిలినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఏఎంఓహెచ్ డాక్టర్ అన్నపూర్ణ, తదితరులు పాల్గొనినారు.

4న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని డివి మేనర్ రోడ్ శ్యామ్ నగర్ 2 వలైన్‌లోని కమ్యూనిటీ హాల్లో 4వ తేదీ ఆదివారం జిల్లాస్థాయి అండర్-15 ఓపెన్ చదరంగ పోటీలు నిర్వహి స్తున్నట్లు మందుల రాజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు 15 సంవత్సరాలోపు వారై ఉండాలని, గెలుపొందిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహంతో పాటు మెడల్స్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా బాల, బాలికులకు 6, 8, 10, 12, 14, 16 ఏజ్ గ్రూపులలో మెమొంటోలు, సర్టిఫికెట్లు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు apchess.org, 9030308811 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అప్రోచ్ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే కేంద్రీయ విశ్వవిద్యాలయానికి అనుసంధానంగా నిర్మించనున్న అప్రోచ్ రోడ్డుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల క్రింద రూ.20 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల అభివ ద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామస్తులకు ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి, రాఘవాపురం సొసైటీ అధ్యక్షుడు చెన్నుపాటి సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, తహశీల్దారు సురేష్, తదితరులు పాల్గొన్నారు.





పుస్తకాలు ప్రాణం పోసిన జీవాలు

- సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎ.నరసింహ
- ఘనంగా ప్రారంభమైన పుస్తక మహోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. పుస్తక ప్రదర్శనను సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎ.నరసింహా శుక్రవారం సాయంత్రం జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడ నగరానికి తాను సొంత పని మీద వచ్చానని, ఇక్కడ పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్నామని ముఖ్య అతిథిగా రావాలని నిర్వాహకులు కోరడంతో పుస్తక ప్రదర్శనకు హాజరైనట్లు తెలిపారు. పుస్తక ప్రదర్శన ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, 36 ఏళ్లగా నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. నాకు తెలిసి 1987లో తెలుగులో అమ్మకు ఉత్తరం రాశానని తన తెలుగు మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. తెలుగు మరచిపోతాననే భయం ఉండేదని, మన భాషను మనమే రక్షించుకోవాలని అన్నారు. పుస్తకాలు ప్రాణం పోసిన జీవాలు అని, అవి మనతోనే ఉంటాయని అన్నారు. ప్రారంభ సభకు శాసన సభ ఉప సభాధిపతి రఘురామ కృష్ణ రాజు అధ్యక్షత వహించగా పలువురు ప్రముకులు పాల్గొన్నారు.

4 గంటల నుండి సందర్శకులు

పుస్తక ప్రదర్శన తొలి రోజు సాయంత్రం 4 గంటల నుండే సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. తమకు కావలసిన పుస్తకాల కోసం వివిధ స్టాల్‌ను సంప్రదించారు. పుస్తక ప్రదర్శన ప్రతి రోజు మధ్యానం 2 నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు.

నేటి కార్యక్రమాలు

శనివారం సాయంత్రం 6 గంటలకు 'పాతికేళ్ళ ప్రచురణ రంగం' అంశంపై చర్చాగోష్ఠి సభ ఉంటుంది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా స్వర్ణ వెంకటనారాయణ (పల్లవి పబ్లికేషన్స్) వ్యవహరిస్తారు. వక్తలుగా దూపాటి విజయకుమార్ (ఎమెస్కో), వల్లూరి శివప్రసాద్ (అరసం కార్యదర్శి), రెంటాల జయదేవ్ (సీనియర్ పాత్రికేయులు), తెలకపల్లి రవి (రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులు), గడ్డం కోటేశ్వరరావు (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్) పాల్గొంటారు.



సభకు హాజరైన జనం



సభలో మాట్లాడతున్న రఘురామ కృష్ణరాజు



యార్లగడ్డ..




విజయకుమార్



లక్ష్మయ్య



రామచంద్రమూర్తి



నారాయణ